క్లుప్తంగా

ఉత్తమ కో–ఆర్డినేటర్‌గా గౌస్



ప్రశంసా పత్రం అందుకుంటున్న గౌస్ అహమ్మద్

ఆత్మకూరు: జిల్లా సమగ్ర శిక్షా పథకం కింద ఆత్మకూరు విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఎంఐఎస్ కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న షేక్ గౌస్ అహమ్మద్ ఉత్తమ సేవా అవార్డును అందజేశారు. ఈ మేరకు శుక్రవారం నెల్లూరులోని సమగ్ర శిక్షా జిల్లా కార్యాలయంలో జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సీహెచ్ ఉషారాణి ప్రశంసాపత్రం గౌస్‌కు అందజేశారు. ఎంఈఓ షేక్ నజీర్‌బాషా అభినందించారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న ఎంవీఐ రాములు

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి చెక్‌పోస్టు వద్ద శుక్రవారం ఆత్మకూరు ఎంవీఐ రాములు వాహన తనిఖీలు నిర్వహించారు. పలు వాహనాలను తనిఖీ చేశారు. ధ్రువీకరణ పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు సరైన పత్రాలు కలిగి ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేపు మెగా టాలెంట్ టెస్ట్

వరికుంటపాడు: నియోజకవర్గంలో పదో తరగతి చదివే విద్యార్థులకు ఆదివారం వింజమూరులోని వైఆర్ జూనియర్ కళాశాలలో ఏపీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో వింజమూరు మండల శాఖ సహకారంతో నియోజకవర్గ స్థాయి మెగా టాలెంట్ టెస్ట్ జరుగుతుందని సందిరెడ్డి మహేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండో బహుమతిగా రూ.8 వేలు, మూడో బహుమతిగా రూ.6 వేలు, నాల్గో బహుమతిగా రూ.5 వేలు, ఐదో బహుమతిగా రూ.4,500, ఆరో బహుమతిగా రూ.4,000, ఏడో బహుమతిగా రూ.3,500, ఎనిమిదో బహుమతిగా రూ.3,000, తొమ్మిదో బహుమతిగా రూ.3,000, పదో బహుమతిగా రూ.3,000 వంతున అందజేస్తారన్నారు. పోటీ పరీక్షలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రోత్సాహక బహుమతులు అందిస్తారన్నారు. పరీక్షకు వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయులకు మాధవరపు నాగేంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పిస్తారన్నారు.

బాధ్యతగా కులగణన సర్వే



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఈశ్వరమ్మ

ఉదయగిరి: మండలంలో జరుగుతున్న కులగణన సర్వేను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది బాధ్యతగా చేపట్టాలని ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ తెలిపారు. ఆమె శుక్రవారం పట్టణంలో జరుగుతున్న సర్వేను పరిశీలించి సిబ్బందికి సూచనలందించారు. సర్వే బృందం ప్రతి ఇంటికి తిరిగి సర్వే నిర్వహించాలన్నారు. నిర్ణీత గడువులోగా సర్వే పూర్తి చేయాలన్నారు. మండలంలో ఇప్పటికే 91 శాతం సర్వే పూర్తయిందన్నారు.

దేవాలయాల్లో చోరీ



దేవాలయాల్లో హుండీలను పగులగొట్టి పొలాల్లో పడవేసిన దృశ్యం

ఆత్మకూరు: మండలంలోని నల్లపరెడ్డిపల్లిలో కొలువైన రామాలయం, సాయిబాబా, గ్రామ దేవత అంకమ్మ దేవాలయాల్లో గురువారం అర్ధరాత్రి తర్వాత దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ మేరకు గ్రామస్తులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కె.ముత్యాలరావు సమాచారం మేరకు దేవాలయాల్లో హుండీలు ఎత్తుకెళ్లి సమీపంలోని పొలాల్లో పగులగొట్టి పడేశారు. రామాలయం హుండీలో సుమారు రూ.5 వేలు, సాయిబాబా మందిరంలో సుమారు రూ.2 వేలు భక్తులు కానుకలుగా సమర్పించి ఉంటారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళల ఆర్థిక సాధికారతకు
ఆసరా, చేయూత

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం మహిళలు ఆర్థిక సాధికారత సాధించేందుకు ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకు వచ్చింది. ప్రతి పేద మహిళ స్వతంత్రంగా ఎదిగేందుకు సహాయపడుతోంది. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకున్న ఎందరో మహిళలు వారి కుటుంబాలకు ఆసరాగా, చేయూతగా నిలిచారు. గతంలో పొదుపు రుణాలు ఇచ్చినా.. అవి తమ కుటుంబ అవసరాలకు వాడుకుని, తిరిగి చెల్లించేందుకు మళ్లీ అప్పులు చేసుకునే పరిస్థితి ఉండేది. ఆ తరుణంలో గత ప్రభుత్వం పొదుపు రుణాలను మాఫీ చేస్తానని చివరకు మోసం చేయడంతో మహిళలు మరింత అప్పుల పాలయ్యారు. ఈ నేపథ్యంలో 2019 సార్వత్రిక ఎన్నికల సమయానికి పొదుపు మహిళలు ఉన్న అప్పును నాలుగు విడతల్లో వడ్డీతో సహా వారి ఖాతాల్లో జమ చేస్తానని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద గడిచిన నాలుగేళ్లుగా పొదుపు మహిళల సొమ్మును వారి ఖాతాల్లో జమ చేస్తున్నారు. నవరత్నాల పథకాల్లో భాగంగా వైఎస్సార్ చేయూత పథకాన్ని అమలు చేశారు. ఈ పథకం కింద ప్రతి ఏటా రూ.18,500 నగదు మహిళల ఖాతాల్లో జమ చేస్తున్నారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాలను సద్వినియోగం చేసుకున్న ఆత్మకూరు పట్టణంలోని అనంతరాయనియేని గిరిజనకాలనీకి చెందిన తిరుమలశెట్టి రత్నమ్మ మేకలు పెంపకాన్ని ఎంచుకుంది. ఇప్పటి వరకు మూడు విడతలుగా మేకలు అమ్ముకుంటూ వచ్చిన ఆదాయంతో కుటుంబానికి ఆసరాగా నిలిచింది. తన కుమారుడికి ఆటో కొనిచ్చింది. రోజు కూలి పనులతో బతికే తమకు పనులు లేని సమయంలో ఎన్నో ఇబ్బందులు పడ్డామని, పొదుపు లోను సైతం కట్టేందుకు ఇబ్బందులు పడ్డామని చెప్పారు. వైఎస్సార్ ఆసరా కింద తనకు నాలుగు విడతల్లో రూ.32 వేలు జమ కాగా, వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏటా రూ.18,750 రావడంతో కొన్ని మేకలు కొనుగోలు చేసి పెంచుకోవడం వల్ల ఈ నాలుగేళ్లలో తన కుటుంబ ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయాయని, ఆర్థిక పరిస్థితులు మెరుగుపడినట్లు చెబుతోంది. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటామని సంతోషం వ్యక్తం చేసింది.



మేకలను పోషిస్తున్న తిరుమలశెట్టి రత్నమ్మ

ప్రైవేట్ బస్సుల
దూకుడుకు కళ్లెం



ఆత్మకూరు ఆర్టీసీ డిపో ఎదుట ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ప్రైవేట్ బస్సును ఆపిన డీఎం కరీమున్నీసా, కార్మిక సంఘాల నాయకులు

- ఆర్టీసీ యజమాన్యం చర్యలు
- కార్మికులతో కలిసి కార్యాచరణ

ఆత్మకూరురూరల్: ఆర్టీసీ ఆదాయానికి గండికొడుతూ ప్రైవేట్ ట్రావెల్స్ యజమానుల దురాగతానికి ఆర్టీసీ యాజమాన్యం చర్యలు చేపట్టింది. కార్మికులతో కలిసి శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, ప్రైవేట్ బస్సుల దూకుడుకు కళ్లెం వేశారు. నిబంధనల ప్రకారం ప్రైవేట్ ట్రావెల్స్ ఆర్టీసీ డిపోలు, బస్టాండ్‌లకు మూడు కిలోమీటర్ల దూరంలో పాయింట్లు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. అయితే ఇటీవల కొన్ని ప్రైవేట్ బస్సులు, ఆర్టీసీ డిపో పరిసరాల్లో ప్రయాణికులను ఎక్కించుకొని బెంగళూరు, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు తీసుకెళ్తుండడంతో సంస్థ ఆదాయానికి గండి పడుతోంది. ఈ నేపథ్యంలో ఆత్మకూరు ఆర్టీసీ సీఐ కల్పన గత మూడు రోజులుగా ప్రైవేట్ బస్సులను కట్టడి చేసేందుకు తమ వంతు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో డిపో మేనేజరుతో పాటు వివిధ కార్మిక సంఘాల యూనియన్లు ఏకమై శుక్రవారం రాత్రి బెంగళూరు వైపు వెళ్తున్న ప్రైవేట్ బస్సును ఆత్మకూరు ఆర్టీసీ డిపో ఎదుటే నిలిపి చట్టపరమైన చర్యలకు ఉపక్రమించారు. ఆత్మకూరు ఆర్టీసీ బస్సు మేనేజరు కరీమున్నీసాతో సహా కార్మిక సంఘాలు ఏకమై నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ప్రైవేట్ బస్సులపై ఉక్కు పాదం మోపారు. దీంతో ప్రైవేట్ బస్సులకు సంబంధించిన కొంత మంది వ్యక్తులు రంగ ప్రవేశం చేసి ఆర్టీసీ యజమాన్యంతో వాగ్వాదానికి దిగి తమ దురాగతాన్ని కొనసాగించేందుకు ప్రయత్నించారు. అయితే ఆర్టీసీ కార్మిక సంఘాలు తీవ్రంగా ప్రతిఘటించడంతో వారు చేసేదేమి లేక మిన్నకుండిపోయారు. ఒక దశలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనండంతో ఆత్మకూరు ఎస్సై ముత్యాలరావు తన సిబ్బందితో రంగ ప్రవేశం చేసి పరిస్థితులను చక్కదిద్దారు. నిబంధనల ప్రకారం ఆర్టీసీ డిపోకు మూడు కిలో మీటర్ల పరిధిలో ప్రైవేట్ బస్సులు తిరగరాదని, ఇకపై ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు

చేజర్ల: మండలంలోని పెరుమాళ్లపాడు సచివాలయం పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. రోగులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందించారు. వైద్యురాలు మెహతాబ్ మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు కారణంగా ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆకు కూరలు, కాయకూరలు తినాలన్నారు. గర్భిణులు పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ కే చంద్రయ్య, ఏఎన్ఎం డి.రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్

దోమల స్వైర విహారం

- రాత్రీ పగలు తేడా లేకుండా విజృంభణ
- అల్లాడిపోతున్న ప్రజలు, పశుపోషకులు

బిట్రగుంట: బోగోలు మండలంలో దోమల తాకిడి జనం అల్లాడిపోతున్నారు. వాతావరణ మార్పులు, పారిశుధ్య లోపంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా దోమలు సంతతి ఈ దఫా విపరీతంగా పెరిగింది. రాత్రి సమయాల్లోనే కాకుండా పగటి సమయంలో కూడా దోమలు వదలడం లేదు. సాయంత్రం ఆరు గంటల నుంచి దోమలు దండయాత్ర తట్టుకోవడం సాధ్యం కావడం లేదు. ప్రస్తుతం వాతావరణంలో తేమ శాతం అధికంగా ఉండడంతో దోమల ఉధృతి అంతకంతకూ పెరుగుతుంది. దోమల వల్ల మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి జ్వరాలు ప్రబలే అవకాశం ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, పంచాయతీ పాలకులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో దోమల ఉధృతి పెరగడానికి కారణమైంది. సాయంత్రమైతే చాలు దోమల తాకిడికి జనం విలవిలాడిపోతున్నారు. ఈ దఫా సన్న దోమలు సంతతి కూడా విపరీతంగా పెరగడంతో ఇళ్ల పైకప్పులు, చెట్లు, పూల మొక్కలపైన కుప్పలు కుప్పలుగా కనిపిస్తున్నాయి. గ్రామాలకు దూరంగా ఉండే కాలనీలు, చెరువులు, పంట పొలాలకు దగ్గరగా ఉండే గ్రామాల్లో దోమల తాకిడి ఎక్కువగా ఉంది. దీంతో ప్రజలు మస్కిటోకాయిల్స్, లిక్విడ్స్, ఎలక్ట్రిక్ బ్యాట్లు, దోమ తెరలపై ఆధారపడుతున్నారు.

పాడి రైతుల పరిస్థితి మరీ దారుణం

దోమల దెబ్బకు పాడి రైతుల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. దోమలు గుంపులు గుంపులుగా పశువుల కొట్టాల్లో చేరి గేదెల రక్తం పీలుస్తుండటంతో గేదెలు రాత్రంతా నిద్ర లేకుండా నిలువుకాళ్ల మీద నిలబడిపోతున్నాయి. దోమల దెబ్బతో నిద్ర కరువై చిరాకు కూడా అధికం కావడంతో పాల ఉత్పత్తి గణనీయంగా పడిపోతుంది. గేదెల బాధ చూడలేక రైతులు దోమ తెరలు వినియోగించాల్సి వస్తుంది. ఒక్కో దోమతెర సైజును బట్టి రూ.800 నుంచి రూ.1500 వరకూ ఉంటున్నాయి. ఆర్థికంగా భారమైన మూగజీవాల కోసం వెచ్చించక తప్పని పరిస్థితి నెలకొంది.

పట్టించుకోని అధికారులు

సాధారణంగా అక్టోబర్ నుంచి మార్చి వరకు దోమల ఉధృతి అధికంగా ఉంటుందని తెలిసినా అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. సాయంత్రం సమయాల్లో ఫాగింగ్ యంత్రాల ద్వారా ఫాగింగ్ చేయించడం, మురుగు నీరు నిల్వ చేరకుండా జాగ్రత్తలు తీసుకోవడం, డ్రైనేజీ కాలువల్లో ఆయిల్ బాల్స్ వేయించడం వంటి కనీస చర్యలు చేపట్టినా దోమల ఉధృతి తగ్గుతుంది. అధికారులు మాత్రం ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనుమసముద్రంపేట: మండలంలోని ఏఎస్‌పేట, హసనాపురం సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ నిరంజన్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

రేపు మండల సమావేశం

వరికుంటపాడు: మండలంలోని స్త్రీశక్తి భవనంలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గవదగట్ల వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండలంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై, శాఖల పనితీరుపై సమీక్ష ఉంటుందన్నారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక సభ వాయిదా

వరికుంటపాడు: వరికుంటపాడు ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో శనివారం జరగనున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక సామాజిక తనిఖీ ప్రజావేదిక సభ అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు ఎంపీడీఓ సీహెచ్ శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ప్రజావేదిక సభ ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామన్నారు. ఈ మార్పును గమనించి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

వరికుంటపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శనివారం నాల్గో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పొదుపు మహిళలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు హాజరుకావాలని కోరారు.

పట్టణాభివృద్ధికి సహకారం



నూతన మున్సిపల్ కమిషనర్‌ను అభినందిస్తున్న కౌన్సిలర్లు, పార్టీ నాయకులు

ఆత్మకూరు: పట్టణాభివృద్ధికి కౌన్సిలర్లు, అధికారుల సహకారం, సమన్వయం ముఖ్యమని నూతన కమిషనర్ షజులుల్లా తెలిపారు. ఆత్మకూరు మున్సిపల్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు ఆయన్ను మున్సిపల్ కౌన్సిలర్లు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు గంధళ్ల వేణు, రాజశేఖర్, పట్టణ బూత్ కమిటీ మేనేజరు సయ్యద్ జమీర్ బాషా, పార్టీ నాయకులు కొప్పోలు చిన్నపరెడ్డి, ఎండీ ముజీబుల్లా తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

వరికుంటపాడు: సమాజంలో ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉండొచ్చని స్థానిక పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజశేఖరరాజు, పబ్లిక్ హెల్త్‌నర్స్ సుశీలమ్మ అన్నారు. శుక్రవారం వరికుంటపాడులో జరుగుతున్న ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఏవైనా వ్యర్థాలు ఉంటే తొలగించుకోవాలన్నారు. కుండలు, నీటితొట్లలో నిల్వ ఉండే నీటిని ఎప్పటికప్పుడు తొలగించి శుభ్రపరచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం జానకి, ఆరోగ్య సహాయకుడు రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓల బాధ్యతల స్వీకరణ

సంగం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎంపీడీలను ప్రభుత్వం బదిలీ చేసింది. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎంపీడీఓలు బాధ్యతలు స్వీకరించారు. సంగం ఎంపీడీఓగా పీ శేషగిరిరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఆయన్ను సంగం ఎంపీడీఓగా బదిలీ చేసింది.

ఏఎస్‌పేట ఎంపీడీఓగా వెంకటేశ్వర్లు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట ఎంపీడీఓగా కె.వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఆయన ఏఎస్‌పేటకు బదిలీ అయ్యారు.

అనంతసాగరం ఎంపీడీఓగా తాజ్ మస్రూర్

సోమశిల: అనంతసాగరం ఎంపీడీఓగా షేక్ తాజ్ మస్రూర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన చిత్తూరు జిల్లా కుప్పంలో విధులు నిర్వహిస్తున్న ఆయన్ను అనంతసాగరం ఎంపీడీఓగా బదిలీ చేసింది.

జలదంకి ఎంపీడీఓగా రాజశేఖర్‌రావు

జలదంకి: జలదంకి ఎంపీడీఓగా కోమటనేని రాజశేఖర్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గుడ్లూరు మండలం ఎంపీడీఓగా పనిచేస్తూ బదిలీపై జలదంకికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న బత్తిన సింగయ్యను చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు.

కొండాపురం ఎంపీడీఓగా సుజాత

కొండాపురం: కొండాపురం ఎంపీడీఓగా శుక్రవారం పి. సుజాత బాధ్యతలు స్వీకరించారు. ఆమె ప్రకాశం జిల్లా నుంచి ఇక్కడకు బదిలీయ్యారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీఓ ఎం. బ్రహ్మయ్య చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు.

మెట్ట పంటలకు సాగునీరు విడుదల

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం జలాశయం ఆయకట్టు కింద సాగు చేసిన మెట్ట పంటలకు సాగునీరు విడుదల చేసినట్లు జలవనరుల శాఖ ఈఈ ఆర్.వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఆయన అధికారులతో కలిసి జలాశయాన్ని పరిశీలించి రైతులతో చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం జలాశయంలో 9.5 అడుగుల మేర నీరు నిల్వ ఉందన్నారు. ఆయకట్టు భూముల్లో మెట్ట పంటలు సాగు చేసిన రైతులు పంటలు ఎండుతున్నాయని, నీటిని విడుదల చేయాలని తమ దృష్టికి తెచ్చారన్నారు. రైతుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని కుడి కాలువకు 30, ఎడమ కాలువకు 50 క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేశామన్నారు. నీటిని రైతులు వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ముందుగా ఆయన స్థానిక సబ్ డివిజన్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట డీఈ చంద్రమౌళి, ఏఈలు వేణు, సురేష్, సిబ్బంది ఉన్నారు.



రైతులతో చర్చిస్తున్న అధికారులు

మిరప, పత్తిలో సమగ్ర సస్యరక్షణపై అవగాహన

మర్రిపాడు: మిరప, పత్తి పంటల్లో సస్యరక్షణపై రైతులకు నెల్లూరు డీఆర్‌సీ, కేవీకే, మర్రిపాడు ఏఓ అవగాహన కల్పించారు. మండలంలోని పడమటినాయుడుపల్లి ఆర్బీకేలో డీఆర్‌సీ సహాయ వ్యవసాయ సంచాలకులు జీ లక్ష్మీమాధవి పత్తి, మిరపలో సమగ్ర సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యం, సూక్ష్మపోషకాల లోపాల నివారణపై వివరించారు. కేవీకే శాస్త్రవేత్త కె.కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పైర్లలో జీవన ఎరువుల ఆవశ్యకత, వాడే విధానాన్ని వివరించారు. ఏఓ రామ్మోహన్ విత్తన ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు పంటల సాగు విధానంపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీకే ఇన్‌చార్జి వీ ప్రశాంతి, పీ నరేష్, ఆర్‌బీకే పరిధిలోని రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారులు

మారుమూల గ్రామాలకు పోస్టల్ సేవల విస్తరణ

ఉదయగిరి: జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు సైతం పోస్టల్ సేవలు విస్తరిస్తున్నట్లు నెల్లూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్ఆర్ కేహెచ్ ప్రసాద్ తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక తపాలా కార్యాలయ ఆవరణలో జరిగిన ఉదయగిరి సబ్ డివిజన్ తపాలా లక్ష్యాల సాధన సమీక్షలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల లబ్ధిదారులకు నేరుగా చేస్తున్న నగదు బదిలీ ప్రయోజనాలను వారు దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే పొందాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంకు సేవలను పల్లెలకు విస్తరిస్తోందన్నారు. సీతారామపురం మండలం దేవమ్మచెరువులో ఇటీవల బ్రాంచ్ పోస్టాఫీసును ప్రారంభించామన్నారు. పోస్టల్ సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. పోస్టల్ పేమెంట్ బ్యాంక్ జిల్లా మేనేజర్ బి.సుధాకర్ మాట్లాడుతూ ఆధార్ అనుసంధాన చెల్లింపులతో పాటు, పెన్షనర్లకు జీవన్ ప్రమాణ్ లైఫ్ సర్టిఫికెట్లు తదితర పథకాల సేవలందిస్తున్నామన్నారు. అనంతరం లక్ష్యాలు సాధించిన సిబ్బందికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వి.సాయికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రసాద్

పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

కలిగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారని జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి తెలిపారు. పోలంపాడు సచివాలయం పరిధిలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ. 25 లక్షల వరకు కార్పొరేట్ వైద్యం చేసుకునే అవకాశాన్ని కల్పించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కాటం రవీంద్రారెడ్డి, స్థానిక నాయకులు అంకిరెడ్డి, ప్రసాద్, తిరుపాలు, వైద్యాధికారిణి గీతారెడ్డి, ఈఓపీఆర్డీ వెలుగోటి మధు తదితరులు పాల్గొన్నారు.



పోలంపాడులో కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ మాల్యాద్రిరెడ్డి, మండల కన్వీనర్ రవీంద్రారెడ్డి

వేదగిరిలో విశేష పూజలు

నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో అభిషేకాలు, విశేష పూజలను భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. అనంతరం స్వామివారి సన్నిధిలో తిరుప్పావై సేవను జరిపారు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆదాయ పన్ను చట్టాలపై అవగాహన

నెల్లూరు(బృందావనం): ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని రోటరీ ఆడిటోరియంలో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఫెడరేషన్ సెంట్రల్ జోన్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. బడ్జెట్ 2024 – ఇన్‌కమ్ ట్యాక్స్, జీఎస్టీ అమెండ్‌మెంట్స్, రేరా ఇంప్లికేషన్స్ ఆన్ బిల్డర్స్‌పై చర్చను జరిపారు. ఆదాయ పన్ను, జీఎస్టీ సవరణలు, రెరా పాలసీ అంశాలను ఫెడరేషన్ వైస్ చైర్మన్, సీఏ రామకృష్ణ వివరించారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, ఫెడరేషన్ సెంట్రల్ జోన్ వైస్ చైర్మన్ వొమ్మిన సతీష్‌బాబు, జనరల్ సెక్రటరీ కొండా శేఖర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ బాబూ అగస్టీస్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ పెట్రోల్ బంక్స్ అసోసియేషన్ డైరెక్టర్ రవికుమార్ చౌదరి, కావలి శాఖ అధ్యక్షుడు వెంకట్రామయ్య, ఉపాధ్యక్షుడు పెనుబల్లి కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.



'షర్మిలను ప్రలోభపెట్టి సీఎంపై కుట్ర'

నెల్లూరు (దర్గామిట్ట): సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఎదుర్కోలేక.. కాంగ్రెస్, టీడీపీ, జనసేన అనైతిక పొత్తులతో షర్మిలను ప్రలోభపెట్టి ఏకంగా ఆయనపైనే కుట్రలు పన్నుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ అధికార ప్రతినిధి లంకా రామశివారెడ్డి విమర్శించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. వైఎస్సార్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో సీఎం నడిపిస్తున్నారని కొనియాడారు. ప్రత్యర్థి పార్టీలతో షర్మిల చేతులు కలిపి జగన్‌మోహన్‌రెడ్డిని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని చెప్పారు.